క్లుప్తంగా

రాట్నాలమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు



రాట్నాలమ్మ ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మ హుండీని భక్తుల సమక్షంలో దేవస్థాన సిబ్బంది లెక్కింపు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి దేవస్థానంలోని హుండీలను సోమవారం లెక్కించగా వచ్చిన రూ.20,16,980 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ధర్మకర్తలు గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్దన్‌రావు, నాగార్జున లక్ష్మీరాధిక, ఈడా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల సదనానికి వాషింగ్ మెషీన్ వితరణ



ఎస్పీ అందించిన వాషింగ్ మెషీన్‌తో బేబి సరోజిని

దెందులూరు: ఎస్పీ డీ.మేరిప్రశాంతి ఇటీవల దెందులూరు ప్రభుత్వ బాల సదనానికి తనిఖీ నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా వసతులను పరిశీలించిన ఆమె విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. దుస్తులు శుభ్రం చేసుకోవడానికి వాషింగ్ మెషీన్ అవసరమని విద్యార్థులు చెప్పారు. చిన్నారులు అడిగిన నాలుగు రోజుల్లో ఎస్పీ మేరి ప్రశాంతి వాషింగ్ మెషీన్‌ను బాల సదనానికి అందజేశారు. బాలసదనం సూపరింటెండెంట్ విద్యార్థులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు అఖిల్‌కుమార్ ఎంపిక



అఖిల్‌కుమార్

దెందులూరు: జాతీయ స్థాయి జూడో పోటీలకు మండలంలోని ఉండ్రాజవరం గ్రామానికి చెందిన డీ.అఖిల్‌కుమార్ ఎంపికయ్యారని జూడో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సూర్యప్రకాష్, రమణ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు డీ.అఖిల్‌కుమార్ అర్హత సాధించాడన్నారు. ఢిల్లీలో ఈ నెల 31న నిర్వహించనున్న జాతీయ స్థాయి జూడో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి అఖిల్‌కుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్నా డని తెలిపారు. విజయం సాధించి రాష్ట్రా నికి, కుటుంబ సభ్యులకు మంచిపేరు తీసుకురావాలని అసోసియేషన్ సభ్యులు ఆకాంక్షించారు.

30న స్వాతంత్ర్య సమరయోధులకు సత్కారం



స్వాతంత్ర్య సమరయోధునికి జాతీయజెండాను అందించిన నూకరాజు

దెందులూరు: ఆజాదీ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ నెల 30న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచన మేరకు మేరా మాటి మేరా దేశ్ నినాదంతో మండలంలోని స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్నామని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు.161 అడుగుల జాతీయ పతాకంతో 500 బైకులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. దెందులూరు, కొవ్వలి, దోసపాడు, పోతునూరు, సోమవరప్పాడు, సత్యనారాయణపురంలోని స్వాతంత్ర్య సమరయోధులను కలిసి వారికి జాతీయ జెండాలు అందజేసి ఆహ్వానించినట్టు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఏలూరు రూరల్: ఏలూరు మండలం కోటేశ్వర దుర్గాపురంలో మంగళవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పర్యటించనున్నారని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు చెప్పారు. సాయంత్రం 3 గంటలకు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని, గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించి, ప్రజా సమస్యలను తెలుసుకుని సచివాలయ ఉద్యోగులతో చర్చిస్తారని పేర్కొన్నారు.

926 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు

ఏలూరు రూరల్: ప్రభుత్వం కొత్తగా 926 పేద కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసిందని ఏలూరు మండల సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఇందులో 784 కార్డులు ఏలూరు నగరవాసులకు, మరో 178 కార్డులు గ్రామీణ ప్రజలకు మంజూరయినట్టు చెప్పారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్తకార్డుదారుల ఇంటివద్దనే బియ్యం, పంచదార పంపిణీ చేస్తామని తెలిపారు.

పేదల పక్షాన నిలిచిన సీఎం జగనన్న

- వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ప్రజలు ఘన విజయాన్ని అందించాలి
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం



కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: పేదల పక్షాన నిలబడిన జగనన్నను మరోసారి సీఎం చేయడానికి కంకణబద్ధులు కావాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం కై కరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్ ప్రభుత్వంలో పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా వాసుబాబు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెత్తందార్లకు పేదలకు జరుగుతున్న రానున్న ఎన్నికలలో పేదవర్గాలు అందరూ సీఎం జగన్‌కు మద్దతు తెలపాలని కోరారు. పెత్తందార్ల వైపు నిలబడుతున్న ప్రతి పక్షాలకు మరోసారి గుణపాఠం చెప్పాలని కోరారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలకు కడుపు మంటగా ఉంటోందని అన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని సీఎం జగన్ పేదలకు పథకాలు అందజేస్తున్న విషయం ప్రజలు గ్రహించాలని కోరారు. నాడు- నేడుతో పేదల పిల్లలు చదువుకునే పాఠశాలలను అభివృద్ధి చేశారని అన్నారు. 3,500 జబ్బులు చేర్చి ఆరోగ్య శ్రీని అమలు చేస్తున్నారని అన్నారు. ఇంటివద్దకే పెన్షన్, రేషన్ ఇచ్చే విధానం ప్రతిపక్షాలకు నచ్చడం లేదన్న విషయం ప్రజలు గ్రహించాలని వాసుబాబు కోరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీకి ప్రజలు ఘన విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పంచాయతీరాజ్ వైసీపీ జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, ఎంపీటీసీ సభ్యులు పంతులు వెంకన్న, పెద్ద అప్పన్న, నాయకులు నక్కా శ్రీను, వై.శ్రీనివాసు పాల్గొన్నారు.

నేడు చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం చేబ్రోలు గాంధీనగర్‌లో మంగళవారం సాయంత్రం 4గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఉంగుటూరు మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. మండలంలోని వైసీపీ నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికార్లు పాల్గొనాలని మంగరావు కోరారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



గుండుగొలనులో విశేష అలంకరణలో స్వామి వారు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న సీతా రామస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆల య ట్రస్టీ ఫౌండర్ కొండా గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మూడో రోజైన సోమవారం ఆలయ పూజారి సుధీరాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్చరణతో విశేషపూజలు నిర్వహించారు. స్వామి వార్లను విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. ఆలయంలో పవిత్ర హోమం, శాంతి హోమం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

హౌసింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే వాసుబాబుకు వినతిపత్రం అందజేస్తున్న హౌసింగ్ సిబ్బంది

గణపవరం/భీమడోలు : రెండు దశాబ్దాలుగా గృహ నిర్మాణ సంస్థలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉంగుటూరు నియోజకవర్గ హౌసింగ్ సిబ్బంది ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వాసుబాబును కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం ప్రారంభించిన సందర్భంగా 2005లో వర్కుఇన్‌స్పెక్టర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్ చదివిన వారిని తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాల్లోకి తీసుకున్నారని అన్నారు. అప్పటినుంచి చాలీచాలని జీతాలతో గడుపుతున్నామని, పాదయాత్ర సందర్భంగా తమ సమస్యలు పరిష్కరిస్తానని జగన్ ఇచ్చిన హామీ తమలో కొత్త ఆశలు కల్పించిందన్నారు. తమ వయస్సు 45ఏళ్లు దాటినందున వేరే ఉద్యోగావకాశాలు కూడా కోల్పోయామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని వాసుబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రస్తుతం చేపట్టిన వైఎస్సార్ జగనన్న కాలనీలు త్వరగా పూర్తిచేయడానికి సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దంత వ్యాధులపై నిర్లక్ష్యం తగదు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దంత వైద్యులు

గణపవరం: దంత వ్యాధులపై నిర్లక్ష్యం తగదని, సమస్య ఏర్పడిన వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందితే దంతాలు పాడవకుండా ఉంటాయని జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. సోమవారం గణపవరం మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం విష్ణు దంత వైద్యకళాశాల సహకారంతో పాఠశాలల విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో పరమేశ్వర్లు మాట్లాడుతూ చిన్నతనం నుంచే దంత సంరక్షణపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా 500 మంది పిల్లలకు దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి కళాశాల దంత వైద్యశాల ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఈకార్యక్రమంలో విద్యాజ్యోతి విద్యాసంస్థల అధినేత సీహెచ్ నాగేశ్వరరావు, పీఎంపీ అసోసియేషన్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కోశాధికారి అప్పారావు పాల్గొన్నారు.దంత వైద్యులు చైతన్య, వరుణ్, మానస, హిమప్రియ, భావన, నవ్య తదితరులు పాల్గొన్నారు

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వినతి



ఏలూరులో ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తున్న పూళ్ల వైసీపీ నాయకులు

భీమడోలు: జాతీయ రహదారి పూళ్ల వద్ద సెంట్రల్ లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేయించాలని సోమవారం వైసీపీ నాయకులు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జాతీయ రహదారి పూళ్ల వద్ద నేషనల్ హైవే అథారిటీ సంస్థ నిర్మాణ సమయంలో ఎటువంటి లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, క్షతగాత్రులవుతున్నాయన్నారు. రాత్రి వేళల్లో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారన్నారు. దీనితో గ్రామస్తులు రోడ్డుపైకి రావాలంటేనే భయపడిపోతున్నారన్నారు. పూళ్ల గ్రామానికి చెందిన ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, పార్టీ కార్యదర్శి ఎండా రవి, నాయకులు బోగయ్య ఎంపీ దృష్టికి సమస్యలను తీసుకుని వెళ్లారు. గ్రామ పరిధిలోని హైవేపై 15 లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. 20 వేల జనాభా కలిగిన పూళ్ల పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల్లో 20వేల మంది జనాభా నివాసముంటున్నారని, ఈగ్రామంలో ఒకే బ్యాంకు ఉందని, ఇక్కడ జనాభా అవసరాలు తీర్చేందుకు ఒక శాఖ సరిపోవడం లేదన్నారు. ఇక్కడ ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయించాలని వారు కోరారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ అమర వీరులకు సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం అమరవీరుల వర్ధంతి కార్యక్రమం పార్టీ నగర అధ్యక్షుడు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన వీరులను సదా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ బ్యాంక్ ఆదేశాల మేరకు నాడు చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలను పెంచడం ఆచార్జీలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, నాటి కాంగ్రెస్, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గొప్ప విద్యుత్ పోరాటం సాగిందని గుర్తు చేశారు. నాడు చంద్రబాబు నాయుడు విద్యుత్ పోరాటం చేస్తున్న వారిపై పోలీసులతో కాల్పులు జరిపించడంతో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి బలయ్యారని వివరించారు.

పదవులు మరింత బాధ్యతను పెంచుతాయి



ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును సత్కరిస్తున్న తుమ్మగుంట రంగా, బీసీ నాయకులు

భీమడోలు: పదవులు మరింత బాధ్యతను పెంచుతాయని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు మండల యూత్ అధ్యక్షుడు, జగన్ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగాకు జిల్లా కమిటీలో కార్యనిర్వాహక సభ్యుడిగా స్థానం కల్పించడంతో సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును క్యాంపు కార్యాలయంలో కలిసారు. వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు యువత నడుం బిగించాలని, పదవులను అలంకారప్రాయంగా కాకుండా మరింత వన్నె తెచ్చేలా పని చేయాలని కోరారు. క్రియాశీలకంగా ఉండే పదవులను అప్పగించిన పార్టీకి మరింత నమ్మకంగా పని చేయాలన్నారు. పదవులు ద్వారా ప్రజలకు మరింత చేరువై, ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పని చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు తీసుకెళ్లడంతో పాటు ప్రజలను చైతన్యపర్చాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్ల నాని తన కమిటీలో బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. మునుపెన్నడూ లేని విధంగా బీసీలకు కమిటీలో పెద్ద పీట వేసారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అనేక పదవులు కేటాయించారన్నారు. తుమ్మగుంట రంగా మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం తుమ్మగుంట రంగా తదితరులు ఎమ్మెల్యే వాసుబాబును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నేతలూ మర్యాద నేర్చుకోండి



టీడీపీ అసత్య ఆరోపణలను తిప్పి కొడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ చల్లగొళ్ళ భూస్వామి

పెదవేగి : ప్రతిపక్షం మాట్లాడితే మంచి..అధికార పక్షం మాట్లాడితే చెడు అన్న ధోరణికి స్వస్తి పలికి టీడీపీ నేతలు మర్యాద నేర్చుకోవాలని కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ భూస్వామి అన్నారు. పెదవేగి మండలం కొప్పాక సొసైటీ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ కార్యక్రమం ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా భూస్వామి మాట్లాడుతూ మాజీ మంత్రి దేవినేని ఉమా, టీడీపీ సీనియర్ నేత అయన్నపాత్రుడు సీఎం అనే గౌరవం కూడా లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని హెచ్చరించారు. అవగాహన లేకుండా పోలవరం, పట్టిసీమ పనులపై లోకేశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, సమర్థవంతంగా పథకాలు అమలు చేస్తున్నారని భూస్వామి తెలిపారు. నేడు పగటి పూట నిరంతరాయంగా 9 గంటల కరెంటు ఇస్తూ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. రాజధాని ప్రభుత్వ మిగులు భూమిలో నిర్మించాలని ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే జగన్ ఆనాడు అసెంబ్లీలో చెప్పిన విషయాన్ని సభాముఖంగా చరవాణిలో ఉన్న వీడియోను భూస్వామి నాయకులకు, కార్యకర్తలకు వినిపించారు. ఎంపీపీ తాతా రమ్య మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, గ్రామ నాయకుడు పర్వతనేని నాగయ్య మాట్లాడుతూ మరో ముప్పై ఏళ్లు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని, అప్పటివరకు చంద్రబాబుకి ప్రతిపక్ష హోదా తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, సొసైటీ డైరెక్టర్లు పులవర్తి దేవానంద్, బత్తిన శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పర్వతనేని కృష్ణారావు, సొసైటీ పరిధిలోని ఎనిమిది గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది ఎంపిక

ఏలూరు (టూటౌన్): సర్ సీఆర్‌రెడ్డి కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వసంత్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, విశాఖపట్టణం ప్రతినిధులు సోమవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలైటికల్ కెమిస్ట్రీ, బీఎస్సీలో కెమిస్ట్రీ సబ్జెక్టు చదివిన విద్యార్థులకు రాతపరీక్ష, టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికయిన విద్యార్థులకు సర్ సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్ ప్రసాద్, పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ఇంటర్మీడియేట్ కరస్పాండెంట్ కలగర శివరామకృష్ణ ప్రసాద్, మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ డైరెక్టర్ వీఆర్‌ఎస్ బాబు యలమర్తి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, ఐక్యూసి కోఆర్డినేటర్ జి.రాము అభినందించారు. ఆర్అండ్‌డీ అడ్వైజర్ ఏవీఎస్ రాజారావు, పాల్గొన్నారు.

సమరభేరి పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): నిరుద్యోగం, అధిక ధరలు అరికట్టాలని సీపీఎం చేపట్టిన సమరభేరీ పోస్టర్‌ను స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో నగర కార్యదర్శి పి.కిషోర్ సోమవారం విడుదల చేశారు. ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఈనెల 30 నుంచి సెప్టెంబరు 4 వరకు దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక పెట్రోలు, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు పెంచుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై ధరల భారాలు వేసిన బీజేపీ అదాని, అంబాని వంటి కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తోందని విమర్శించారు. మోదీ అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగులిస్తానని హామీ ఇచ్చారని, కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇప్పటికీ ఇవ్వలేదని వివరించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిందని, ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు వారికి అమ్మేస్తోందని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మావూరి శ్రీనివాసరావు, ఎం.ఇస్సాక్, మీసాల సత్యనారాయణ, పి.బాలరాజు, ఎస్.సత్యనారాయణ, కేసనపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

31న సంతోషిమాతకు పూజలు

ఏలూరు రూరల్ : రాఖీపౌర్ణమి సందర్భంగా ఈ నెల 31న కొల్లేరు గ్రామం మొండికోడులో వెలసిన శ్రీసంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, అభరణాలతో అలంకరించి అమ్మవారి పుట్టినరోజు వేడుక కనులపండువగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంతోషిమాత దర్శనం కోసం ఏటా కొల్లేరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చే యువతీ, యువకులు, భక్తులు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు పరివేక్షణలో ఆలయ ఆవరణలో భక్కులకు భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్టు తెలిపారు.

వ్యావహారిక భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి కృషి



భీమడోలులో చిన్నారులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న టీవీ ఉమామహేశ్వరరావు

ఉంగుటూరు: వ్యావహారిక భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి కృషి మరువరానిదని నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. సోమవారం కళాశాలలో గిడుగురామూర్తి 160వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అంతర్జాల సమావేశంలో అధ్యక్షస్థానంలో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు కృషి చిరస్మరణీయమన్నారు. ముఖ్యవక్తగా పాల్గొన్న ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యుడు డాక్టర్ బూసి వెంకటస్వామి మాట్లాడుతూ భావ వ్యక్తీకరణకు భాషే ఆధారమన్నారు. మాతృ భాష పరాయిభాష ప్రభావాన్ని గురైనప్పుడు దాని ఉనికి కోల్పోయే స్థితి నుంచి స్వాతంత్ర్యంగా మనగలగడానికి కారణం గిడుగు నడిపిన వ్యావహారిక భాషా ఉద్యమం అని అన్నారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డా. వై.విజయానందరాజు, మాట్లాడుతూ తెలుగు బాష దినోత్సవం విశిష్టతను వివరించారు. సదుస్సు సంచాలకులు డా. కొండారవి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఐక్యు కోఆర్డినేటర్ రెడ్డయ్య, వివిధ కళాశాలలకు చెందిన 160 మందికి పైగా విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిన మహనీయుడు గిడుగు

భీమడోలు: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని జిల్లా డైమండ్ లయన్స్ క్లబ్ ప్రతినిధి తుమ్మల వెంకటఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో తెలుగు వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. చిన్నారులకు గిడుగు జీవిత చరిత్ర, పద్యాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీవీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిడుగు జయంతిని వారం రోజులు నిర్వహించడం చాలా సంతోషమన్నారు. గ్రాంధికంలో ఉన్న తెలుగు భాషను వ్యావహారిక భాషగా ప్రజలకు చేరువ చేసిన గిడుగు మహనీయుడన్నారు. చిన్నతనం నుంచి తెలుగు భాషపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్ పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.